సాక్షి
సూర్యాపేట
ఆదివారం, 1, సెప్టెంబర్, 2024



అడ్డుగా ఉన్నాడని..
వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను హత్య చేసిన భార్యతో పాటు ఆమె ప్రియుడిని పోలీసులు అరెస్టు చేశారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం: 590 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం	: 589.00 అడుగులు
ఇన్‌ఫ్లో	: 4,61,245 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 4,12,078 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 28,460 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 5,292 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 5,510 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం: 645 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం: 644 అడుగులు	
ఇన్‌ఫ్లో	: 10,179.65 క్యూసెక్కులు
క్రస్ట్ గేట్లు	: 13,300 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 145.39 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 145.39 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

కనీస అవగాహన లేని మంత్రి ఉత్తమ్

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట టౌన్: భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్‌ఫిట్ అని, కనీస అవగాహన లేని మంత్రి ఎవరైనా ఉన్నారంటే ఆయన ఉత్తమ్‌కుమార్‌రెడ్డేనని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిచేసిన ప్రాజెక్టుల కింద కూడా నీళ్లు ఇవ్వలేని చేతగాని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అని విమర్శించారు. నాగార్జునసాగర్ కింద కూడా పూర్తి స్థాయిలో నీళ్లు ఇవ్వకుండా అధికార దర్పంతో, అడ్డగోలు మాటలతో టైంపాస్ చేస్తున్నాడన్నారు. రాష్ట్రంలో డెకాయిట్ల పాలన నడుస్తుందన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులే పెద్ద డెకాయిట్లు అని, అన్ని శాఖలలో అవినీతి రాజ్యమేలుతుందన్నారు. మంత్రి సొంత నియోజకవర్గం హుజూర్‌నగర్‌లో కూడా పంటలు ఎండిపోతున్నాయని, కేసీఆర్ సరైన సమయంలో బయటికి వస్తారని, వీళ్ల బండారాన్ని బయటపెడతారని చెప్పారు. వ్యవసాయాన్ని సర్వనాశనం చేసిన దద్దమ్మలు మీరని ఘాటుగా విమర్శించారు.

తిరుమలగిరి మున్సిపల్ కమిషనర్ బదిలీ

తిరుమలగిరి: తిరుమలగిరి మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి నల్లగొండ జిల్లా హాలియా మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా తిరుమలగిరి మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా మున్సిపల్ మేనేజర్ బుచ్చిబాబుకు బాధ్యతలు అప్పగించారు.

టెస్టుల పేరుతో రోగులను మోసగించొద్దు

నూతనకల్: ఆసుపత్రులకు వచ్చే రోగులను టెస్టుల పేరుతో మోసగిస్తూ ఆర్థిక ఇబ్బందులకు గురిచేయొద్దని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ కోటాచలం అన్నారు. శనివారం నూతనకల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని సమ డెంటల్ ఆసుపత్రికి ఎలాంటి అనుమతులు లేవని నోటీసులు జారీ చేశారు. వైద్య ఆరోగ్య శాఖకు దరఖాస్తు చేసుకొని ఆసుపత్రిని నిర్వహించాలని కోరారు. ఆయన వెంట మండల వైద్యాధికారి కీసర అశ్రితారెడ్డి, సీహెచ్‌ఓ శరణ్‌నాయక్ ఉన్నారు.

ఉపాధ్యాయుల సేవాభావం ప్రశంసనీయం

సూర్యాపేట టౌన్: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్)కు చెందిన ఉపాధ్యాయ ప్రతినిధులు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించడం ప్రశంసనీయం జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) కె.అశోక్ అన్నారు. డెంగీ జ్వరం పీడితుల సహాయార్థం డీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీకాంత్ భట్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎస్.రవి, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య, పేదల డాక్టర్ రంగారెడ్డి, సూర్యాపేట సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్ లింగంపల్లి భద్రయ్య, నర్సయ్య, శ్రీనివాస్, బీవీ.రావు, ఎం.దశరథ రామారావు, కె.యోగానంద్, కవిత, ఆనందభాస్కర్, రమణ, వెంకటేశ్వర్లు, క్రాంతికుమార్ పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో డీఈఓ అశోక్, డాక్టర్లు, డీటీఎఫ్ నాయకులు



మఠంపల్లి : యాతవాకిళ్ల గ్రామం వద్ద వేములూరు రిజర్వాయర్ అలుగు మీదుగా ఉధృతంగా పారుతున్న వరదనీరు

రోజంతా కుండపోత

హుజూర్‌నగర్‌లో అత్యధికంగా 27.38 సెంటీమీటర్ల వర్షం

- మరో నాలుగు మండలాల్లో అతి భారీ వర్షాలు
- ఒక్క రోజులోనే 10.20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు
- జిల్లా అంతటా విస్తారంగా వాన

సూర్యాపేట: జిల్లా వ్యాప్తంగా శనివారం కుండపోత వర్షం కురిసింది. రికార్డు స్థాయిలో హుజూర్‌గర్, చిలుకూరు మండలాల్లో అత్యంత భారీ వర్షం పడింది. అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షంతో సూర్యాపేట జిల్లా అతలాకుతలమైంది. లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపించాయి. శనివారం ఉదయం నుంచి మోస్తరు వర్షం వస్తూ పోతూ కురిసింది. ఇక సాయంత్రం ఐదు గంటల తర్వాత భారీ వర్షం పడింది. ఈ క్రమంలో జిల్లాలో సరాసరి 10.20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రధానంగా జిల్లాలో గంట గంటకు వర్షం తీవ్రత మారుతూ కురిసింది. సాయంత్రం 6 గంటలకు వరకు ఏడు మండలాల్లో భారీ వర్షం కురవగా, 7 గంటల వరకు మూడు మండలాల్లో అతి భారీ వర్షం, మరో ఏడు మండలాల్లో భారీ వర్షం పడింది. మిగతా అన్ని మండలాల్లోనూ మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షం రాత్రి 9 గంటల వరకు మరింత పెరిగి జిల్లాలోని రెండు మండలాలు హుజూర్‌గర్‌లో 27.38 సెంటీమీటర్లు, చిలుకూరులో 26.75 సెంటీమీటర్ల రికార్డు స్థాయిలో అత్యంత భారీ వర్షం పడింది. అలాగే కోదాడలో 17.48 సెంటీమీటర్లు, మఠంపల్లిలో 13.26, సూర్యాపేటలో 12.89, చింతలపాలెం మండలంలో 11.58 సెంటీమీటర్ల చొప్పున అతి భారీ వర్షం పడింది. మరో 13 మండలాల్లో భారీ వర్షం పడింది.



సూర్యాపేట పట్టణంలో కొత్త బస్టాండ్ వద్ద రోడ్డుపైన నిలిచిన వర్షపు నీరు

పులిచింతలకు 3.39 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

హుజూర్‌నగర్: పులిచింతల ప్రాజెక్టుకు శనివారం 3,39,434 క్యూసెక్కులుగా ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్టులోని 13 క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువ నుంచి ప్రకాశం బ్యారేజీకు విడుదల చేస్తున్నారు. 13 గేట్లు, స్పిల్‌వే, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా మొత్తం కలిపి 3,14,434 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 38.45 టీఎంసీల నీరు ఉంది. నీటిమట్టం 175 అడుగులకు గాను 170.07 అడుగుల వరకు నీరు ఉంది. ప్రాజెక్టు జెన్‌కోలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో నాలుగు యూనిట్ల ద్వారా 16 వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 76 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి తెలంగాణ గ్రిడ్‌కు అనుసంధానం చేసినట్లు ప్రాజెక్టు ఎస్‌ఈ దేశ్యా నాయక్ తెలిపారు.

- హుజూర్‌నగర్‌లోని 7వ వార్డులో భారీ వర్షంతో రోడ్లు జలమయం అయ్యాయి. వార్డులో పర్యటించిన మున్సిపల్ యంత్రాంగం స్థానిక ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

వీధులన్నీ జలమయం

అల్పపీడన ప్రభావంతో శుక్రవారం నుంచి జిల్లాలో వాన మొదలైంది. రోజంతా మురుసుపెట్టగా.. అక్కడక్కడా మోస్తరు వర్షం పడింది. ఈ నేపథ్యంలో జిల్లాకు ఆరెంజ్ అలర్ట్‌ను రాష్ట్ర వాతావరణ శాఖ ప్రకటించగా ఈ వాన జోరందుకుని శనివారం తెల్లవారుజాము నుంచే దంచికొట్టింది. ఆగుతూ.. కురుస్తూ సాయంత్రానికి జడివానలా మారింది. హుజూర్‌నగర్, చిలుకూరులో కురిసిన భారీ వర్షానికి వీధులన్నీ జలమయమై చెరువులను తలపించాయి. కోదాడలో మున్సిపల్ కార్యాలయంలోకి నీళ్లు చేరి రికార్డులు తడిసిపోయాయి. రోడ్డు వెంట పార్క్ చేసిన బైక్‌లు వరద ధాటికి కొట్టుకుపోయాయి. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని 60 ఫీట్ల రోడ్డులో పలు ఇళ్లల్లోకి వరద నీరు చేరింది.



హుజూర్‌నగర్ : దొండపాడులో విద్యార్థులను ట్రాక్టర్‌పై ఎక్కించి వాగు దాటిస్తున్న గ్రామస్తులు



తిరుమలగిరి : పత్తి చేనులో నిలిచిన వర్షపునీరు

వర్షపాతం వివరాలు..		అనంతగిరి	11.03	పెన్‌పహాడ్	7.60
మండలం	వర్షపాతం (సెం.మీ)	నాగారం	10.47	మోతె	7.47
హుజూర్‌నగర్	27.38	నడిగూడెం	10.18	పాలకవీడు	7.00
చిలుకూరు	26.75	జాజిరెడ్డిగూడెం	9.95	ఆత్మకూర్(ఎస్)	6.75
కోదాడ	17.48	మద్దిరాల	9.04	నేరేడుచర్ల	6.73
మఠంపల్లి	13.26	నూతనకల్	8.60	చివ్వెంల	5.65
సూర్యాపేట	12.89	తిరుమలగిరి	7.83	తుంగతుర్తి	5.30
చింతలపాలెం	11.58	గరిడేపల్లి	7.67	మునగాల	3.93

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

సూర్యాపేట టౌన్: అధిక వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు, రైతులు, వాహనదారులు, ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన సూర్యాపేటలో మాట్లాడారు. జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. ఏదైనా అత్యవసరమైతే స్థానిక పోలీసులకు, డయల్ 100 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవీ..

- శిథిలావస్థకు చేరిన భవనాల్లో నివాసముండొద్దు. చేపల వేటకు, చెరువులు, వాగులు వద్దకు వెళ్లొద్దు.
- వాతావరణ తడిగా ఉన్నందున కరెంట్ స్తంభాల వద్దకు వెళ్లొద్దు. సాధారణ ప్రజలు కరెంట్ రిపేర్ పనులు చేయవద్దు.
- వర్షం ప్రభావంతో చలి తీవ్రత ఉన్నందున పిల్లలు, వృద్ధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి.
- రోడ్లపై వర్షం నీరు చేరడం వల్ల వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రయాణ సమయంలో వాహనదారులు అత్యంత జాగ్రత్తగా ఉండాలి.
- వాహనాలు వేగంగా నడపొద్దు. వర్షం పడే సమయంలో ప్రయాణాలు చేయకుండా వీలైతే వాయిదా వేసుకోవాలి.
- జాతీయ రహదారి-65పై వాహనదారులు నెమ్మదిగా వెళ్లాలి.
- వ్యవసాయ పనుల్లో రైతులు జాగ్రత్తగా ఉండాలి. పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దు.
- కృష్ణా జిల్లా జగ్గయ్యపేట సమీపంలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వరదనీరు ఉధృతంగా పారుతుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జిల్లా నుంచి అటువైపుగా వెళ్లేవారు తమ ప్రయాణాలను వాయిదా వేసుకుంటే చాలా మంచిది.

ముకుందాపురంలో నీట మునిగిన ఎస్సీ కాలనీ

మునగాల: మండలంలోని ముకుందాపురం గ్రామ పంచాయతీ పరిధిలో గల ఎస్సీ కాలనీకి వరద పోటెత్తింది. దీంతో దాదాపు 30 ఇళ్లలోకి వర్షపునీరు వచ్చి చేరింది. శనివారం సాయంత్రం ఐదు గంటల నుంచి కురిసిన భారీ వర్షం కారణంగా ఎస్సీ కాలనీ పూర్తిగా జలమయమైంది. ఇళ్లలోకి నీరు చేరడంతో నిత్యావసర సరుకుల సహా మొత్తం నీట మునిగాయి. దీంతో కాలనీ వాసులు భయాందోళనకు గురయ్యారు.



వరదనీటిలో నిలబడిన కాలనీ మహిళలు

అధికారుల నియామకం

జిల్లాలో మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ సూచన మేరకు జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి రెండు షిఫ్టుల్లో సిబ్బందిని నియమించారు. 24గంటల పాటు పనిచేసే ఈ కంట్రోల్ రూంలో 5గురు సిబ్బందిని నియమిస్తూ కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రజలు సంప్రదించాల్సిన కంట్రోల్ రూం నంబర్ 6281492368



చివ్వెంల : వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో పొలాల మీదుగా ప్రవహిస్తున్న వరద

మూసీ ఐదు గేట్ల ఎత్తివేత

నకిరేకల్: మూసీ ప్రాజెక్టుకు వరద పెరగడంతో శనివారం రాత్రి ఐదు క్రస్ట్ గేట్లను ఎత్తివేశారు. 7 గంటల ప్రాంతంలో రెండు గేట్లను ఎత్తి 1,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన అధికారులు.. ఆ తర్వాత మరో రెండు గేట్లను ఎత్తారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో వరద భారీగా పెరగడంతో ఐదు గేట్లను ఎత్తి 13,300 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఎగువ నుంచి మూసీకి 10,179 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.

గడువులోగా సీఎంఆర్ పూర్తిచేయాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట): గడువులోగా సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తిచేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. శనివారం సూర్యాపేట కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బీఎస్.లతతో కలిసి సివిల్ సప్లై అధికారులు, మిలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023-24 వానాకాలం, యాసంగి సీజన్ల లక్ష్యాలను సెప్టెంబర్ 30వ తేదీకల్లా పూర్తి చేయాలన్నారు. గతంలో సీఎంఆర్ చెల్లించని వారిపై, అలాగే నిర్లక్ష్యం వహించిన మిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ద్వారా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిల్లర్లంతా ఏ,బీ రిజిస్టర్లు నిర్వహించాలని, ప్రత్యేక బృందాల ద్వారా మిల్లులను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. సీఎంఆర్ లక్ష్యం పూర్తిచేసిన మిల్లర్లకే వచ్చే వానాకాలం సీజన్‌లో ధాన్యం కేటాయిస్తామన్నారు. ముందుగా అదనపు కలెక్టర్ బీఎస్.లత మిల్లులలో పెండింగ్ ఉన్న 2023-24 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించిన సీఎంఆర్‌ను చదివి వినిపించారు. ఈ సమావేశంలో డీఎస్‌ఓ రాజేశ్వర్, సివిల్ సప్లై కార్పొరేషన్ డీఎం టీఎస్ఎస్.ప్రసాద్, ఏసీఎస్‌ఓ. శ్రీనివాస్‌రెడ్డి, సివిల్ సప్లై డీటీలు రాజశేఖర్, రాంరెడ్డి, నాగలక్ష్మి, విజయశేఖర్, మిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

గురుకులంలో సమస్యలు పరిష్కరిస్తాం

తుంగతుర్తి: తుంగతుర్తి గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని గిరిజన గురుకులాల ఉమ్మడి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ అగస్టీన్ అన్నారు. శనివారం ఆయన తుంగతుర్తిలోని గిరిజన గురుకులం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు కరెంట్ షాక్ నుంచి బయటపడటం సంతోషకరమన్నారు. వాటర్ ప్లాంట్ సమస్య పరిష్కారంతోపాటు కళాశాల విద్యార్థులకు ఎకనామిక్స్ సబ్జెక్టు టీచర్‌ను తక్షణమే నియమిస్తామన్నారు. పాఠశాల నెలకొన్న సమస్యలను తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అపర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న గిరిజన గురుకులాల ఆర్‌సీఓ అగస్టీన్

పరిశుభ్రతే లక్ష్యంగా..

- నేటి నుంచి పాఠశాలల్లో 'స్వచ్ఛత పక్వాడ'
- విద్యార్థులకు అవగాహన కల్పించేందుకే కార్యక్రమం
- పదిహేను రోజుల పాటు ప్రక్రియ
- జిల్లాలో 950 ప్రభుత్వ స్కూళ్లు

సూర్యాపేట టౌన్: పరిసరాల అపరిశుభ్రత అనేక రోగాలకు మూల కారణమవుతుంది. ఈ నేపథ్యంలో బాల్య దశ నుంచే పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు విద్యా శాఖ ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని మొత్తం 950 ప్రభుత్వ పాఠశాలల్లో ఆదివారం నుంచి స్వచ్ఛత పక్వాడ (పక్షోత్సవాలు) నిర్వహించేందుకు సిద్ధమైంది. ఆరోగ్యమే మహాభాగ్యం, స్వచ్ఛత అందరి బాధ్యత, పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన దేశాన్ని నిర్మించడం మనముందున్న లక్ష్యం అనే నినాదాలతో విద్యాశాఖ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంటే సీజనల్ వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చు. ఈ విషయాలపై అవగాహన పెంచాలనే లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛత పక్వాడ నిర్వహించనున్నారు. దీని నిర్వహణకు ఇప్పటికే హెచ్‌ఎంలకు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.



15వ తేదీ వరకు..

ఆదివారం ప్రారంభం కానున్న స్వచ్ఛత పక్వాడ కార్యక్రమం ఈ నెల 15వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సమాజం పట్ల బాధ్యత, స్వచ్ఛత, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తారు. మొక్కలు నాటించి హరిత చైతన్యాన్ని కలిగిస్తారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో పాఠశాల స్థాయి నుంచి వివిధ పోటీలు నిర్వహిస్తారు.

పకడ్బందీగా అమలు చేస్తాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని పాఠశాలల్లో స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తాం. ఇప్పటికే అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించి ఆదేశాలు జారీ చేశాం. విద్యార్థులకు, సమాజానికి పరిశుభ్రతపై అవగాహన కలిగించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

– అశోక్, డీఈఓ, సూర్యాపేట

రోజువారీ కార్యక్రమాలు ఇలా..

- 1వ తేదీన ఉపాధ్యాయులు, విద్యార్థులతో స్వచ్ఛత శపథం.
- 2, 3వ తేదీల్లో విద్యార్థులకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తారు.
- 4, 5వ తేదీల్లో సమాజానికి చేరువయ్యేలా కార్యక్రమాలు చేపడతారు.
- 6న బడుల్లో విస్తృతంగా మొక్కలు నాటుతారు.
- 7,8వ తేదీల్లో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీలు నిర్వహిస్తారు.
- 9, 10వ తేదీల్లో పిల్లలకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పిస్తారు.
- 11న వ్యక్తిగత పరిశుభ్రత దినంగా పాటిస్తారు.
- 12న సామాజిక కార్యక్రమాల్లో విద్యార్థుల భాగస్వామ్యం చేస్తారు.
- 13, 14వ తేదీల్లో స్వచ్ఛతపై ప్రణాళిక అమలుకు సమాయత్తం.
- 15న ముగింపు సందర్భంగా విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేస్తారు.

పదోన్నతితో బాధ్యతలు పెరుగుతాయి

- ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేట టౌన్: పదోన్నతితో బాధ్యతలు పెరుగుతాయని జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. జిల్లా స్పెషల్ బ్రాంచ్, డీసీఆర్‌బీ, పోలీస్ కంట్రోల్ రూంలో హెడ్‌కానిస్టేబుల్స్‌గా పనిచేస్తున్న అరుణదేవి, కవిత, జ్యోతి, గోపాల్‌లు ఏఎస్‌ఐగా పదోన్నతి పొందిన సందర్భంగా వారు శనివారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారికి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడారు.

నాగయ్య సేవలు అభినందనీయం

పోలీస్ శాఖలో హెడ్ కానిస్టేబుల్‌గా నాగయ్య అందించిన సేవలు అభినందనీయమని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. మద్దిరాల పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ నాగయ్య శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో నాగయ్య దంపతులను ఎస్పీ సన్మానించి మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో అదనపు ఎస్పీలు నాగేశ్వరరావు, జనార్దన్‌రెడ్డి అడ్మినిస్ట్రేషన్ అధికారి మంజుభార్గవి, పోలీస్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రామచందర్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.



నవరాత్రులకు పటిష్ట బందోబస్తు

జిల్లాలో గణేష్ నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఉంటుందని, ప్రశాంత వాతావరణంలో నవరాత్రులు జరుపుకోవాలని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. శనివారం ఆయన సూర్యాపేట జిల్లా కేంద్రంలో మాట్లాడారు. గణేష్ మండపాల నిర్వాహకులు నియమ నిబంధనలు పాటించాలని, మండపాలను రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసి ట్రాఫిక్ అంతరాయం కలిగించకుండా వాహనాలకు దారి వదలాలన్నారు. మండపాలు, విగ్రహాల ఏర్పాటుకు ఆన్‌లైన్ ద్వారా తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

పోలీసుల సూచనలు

- మండపాలు ఏర్పాటు చేసే స్థలాలకు పంచాయతీ, మున్సిపల్ అనుమతి తీసుకోవాలి.
- ప్రైవేట్ వ్యక్తుల స్థలం అయితే వారి అనుమతి తీసుకోవాలి. వివాదాస్పద స్థలాల్లో మండపాలు ఏర్పాటు చేయొద్దు.
- ఉత్సవాలు ముగిసే వరకు ఉత్సవ కమిటీ సభ్యులు మండపాల వద్ద అందుబాటులో ఉండాలి.
- భక్తులు వచ్చిపోయే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలి. విద్యుత్ శాఖ అనుమతి ఉండాలి.
- ఇతరులను రెచ్చగొట్టే విధంగా, వివాదాస్పదంగా మండపాల వద్ద ప్రసంగాలు చేయొద్దు.
- ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా.. అనుమతి అర్జీదారులు, ఉత్సవకమిటీ సభ్యులే బాధ్యత వహించాలి.
- డీజేలకు, బాణాసంచాలకు అనుమతి లేదు. రాత్రి 10 గంటల లోపు మాత్రమే సంప్రదాయ సంగీతం కార్యక్రమాలు చేపట్టాలి.

క్లుప్తంగా

కేవీకే కార్యక్రమాలు రైతులకు ఉపయోగకరం



కేవీకేలో మొక్కల పెంపకాన్ని పరిశీలిస్తున్న తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం సభ్యులు

గరిడేపల్లి: కేవీకే ద్వారా చేపడుతున్న వివిధ క్షేత్రస్థాయి పరిశోధనలు, శిక్షణా కార్యక్రమాలు, సదస్సులు, వ్యవసాయ సంబంధిత డెమో ప్రదర్శనలు జిల్లా రైతాంగానికి ఎంతో ఉపయోగకరమని తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఫౌండర్, ప్రెసిడెంట్ ఇంద్రారెడ్డి అన్నారు. శనివారం గరిడేపల్లి మండల పరిధిలోని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రాన్ని తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం సభ్యులు సందర్శించారు. కేవీకే ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను కేవీకే శాస్త్రవేత్తలు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వారికి వివరించారు. అనంతరం వైస్ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో కేవీకేతో కలిసి రైతాంగానికి అవసరమైన సాంకేతికతను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వలస కూలీ మృతి

హుజూర్‌నగర్‌రూరల్: జీవితంపై విరక్తితో ఉమ్మెంత కాయలు తిన్న వలస కూలీ అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. శనివారం ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రం నలంద జిల్లా దుర్గాపూర్‌కు చెందిన పంచలాల్ కుమార్(22) మరో నలుగురితో కలిసి హుజూర్‌నగర్ మండలం అమరవరం గ్రామానికి చెందిన కర్నాటి వీరనాగిరెడ్డి రైస్ మిల్లులో కొంతకాలంగా హమాలీగా పనిచేస్తున్నాడు. ఇంటిపై బెంగ, జీవితంపై విరక్తితో ఈ నెల 27వ తేదీన పంచలాల్ కుమార్ మిల్లు పక్కన ఉన్న ఉమ్మెంత కాయలు తిన్నాడు. అవి తిన్న కొద్దిసేపటి తర్వాత అతడు కిందపడిపోయాడు. తోటి హమాలీలు గమనించి వెంటనే హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సూర్యాపేట జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మిల్లు గుమాస్తా తేనె మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండు తలలు, ఆరు కాళ్లతో గేదె దూడ జననం

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని ఇంద్రియాల గ్రామానికి చెందిన రైతు పెద్దిరెడ్డి బుచ్చిరెడ్డి గేదె శనివారం రెండు తలలు, ఆరు కాళ్ల దూడకు జన్మనిచ్చింది. అయితే జన్మించిన కొద్దిసేపటికే దూడ మృతిచెందింది. రెండు తలలు, ఆరు కాళ్ల దూడను చూడడానికి గ్రామస్తులు తరలివచ్చారు.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని..

- ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య
- నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను హత్య చేసిన భార్యతో పాటు ఆమె ప్రియుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా మోతె మండలం రాయపాడ్ గ్రామానికి చెందిన ఓర్సు వెంకన్న(50), అతడి భార్య మైసమ్మ నల్లగొండ పట్టణంలోని ముశంపల్లి రోడ్డులో గల హైటెక్ కాలనీలో ఖాళీ స్థలంలో గుడిసె వేసుకుని నివాసముంటున్నారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మైసమ్మకు నల్లగొండ మండలం వెలుగుపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కండె భిక్షంతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం భర్తకు తెలియడంతో పలుమార్లు ఆమెను మందలించాడు. దీంతో ఎలాగైనా భర్త అడ్డు తొలగించుకోవాలని ప్రియుడితో కలిసి మైసమ్మ పథకం వేసింది. ఆగస్టు 28వ తేదీ రాత్రి 11గంటల సమయంలో వెంకన్న మద్యం కోసం బయటకు వెళ్లి వచ్చేసరికి మైసమ్మ ప్రియుడు భిక్షంతో సన్నిహితంగా ఉండటం చూశాడు. భిక్షంను పట్టుకునేందుకు ప్రయత్నించగా అతడు పారిపోయాడు. కోపోద్రిక్తుడైన వెంకన్న భార్య మైసమ్మపై చేయి చేసుకోబోతుండగా.. ఆమె ఎలాగైనా అతడిని చంపాలని బండరాయిపై నెట్టి వేసింది. దీంతో వెంకన్న తలకు తీవ్ర గాయమైంది. అనంతరం మైసమ్మ భర్తపై కూర్చొని గొంతు నులిమి హత్య చేసింది. అతడు మృతి చెందినట్లు నిర్ధారించుకున్న తర్వాత మైసమ్మ అక్కడి నుంచి పారిపోయింది. మృతుడి సోదరుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న వన్‌టౌన్ పోలీసులు నిందితులను మేళ్లదుప్పలపల్లి రోడ్డులో పట్టుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ సందీప్, శంకర్, వెంకట్ నారాయణ, సిబ్బంది శ్రీకాంత్, షకీల్‌ను డీఎస్పీ అభినందించారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడి వివాహం కావాల్సి ఉంది. మైసమ్మ ప్రియుడు భిక్షంకు వివాహం కాగా గొడవల కారణంగా భార్యకు దూరంగా ఉంటున్నట్లు తెలిసింది.

'సంకల్ప్'ను ప్రారంభించిన బీబీనగర్ ఎయిమ్స్

బీబీనగర్: నవజాత శిశువుల మరణాలను తగ్గించే లక్ష్యంతో బీబీనగర్ ఎయిమ్స్ ఆగస్టు 27న ఐసీఎంఆర్ పరిశోధనా ప్రాజెక్టు 'సంకల్ప్'ను ప్రారంభించింది. ఈ మేరకు ఎయిమ్స్ పరిశోధనా బృందం శనివారం ఆదిలాబాద్ జిల్లాలోని పీహెచ్‌సీలను సందర్శించి ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను అంచానా వేసి ప్రాజెక్టు అమలుకు సంబంధించి అక్కడి వైద్యులు, సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, నర్సింగ్ అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం నవజాత శిశు మరణాల రేటును ప్రతి 1000 సజీవ జననాలకు 10కంటే తక్కువకు తగ్గించాలనే లక్ష్యంతో జిల్లా వైద్య అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శ్రీమతి, ఐఏఎస్ అధికారి కుష్బూ గుప్తా, డీహెంఎచ్ఓ కృష్ణ, ఎయిమ్స్ వైద్యురాలు తణిగైనాథన్ తదితరులు పాల్గొన్నారు,



ఆదిలాబాద్ జిల్లాలో వైద్య బృందంతో సమావేశమైన బీబీనగర్ ఎయిమ్స్ వైద్యులు

గొర్రెల అపహరణ

మర్రిగూడ: మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి 12 గొర్రెలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. స్థానిక ఎస్‌ఐ రంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యరగండ్లపల్లి గ్రామానికి చెందిన మారగోని జంగయ్య తనకున్న 50 గొర్రెలను శుక్రవారం మేతకు తీసుకువెళ్లి సాయంత్రం తన ఇంటి ముందు ఉన్న దొడ్డిలోకి తోలాడు. శనివారం ఉదయం మందలో 12 గొర్రెలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆలయాల్లో చోరీలు చేస్తున్న దొంగల అరెస్ట్

- రూ.80వేల విలువైన బంగారు ఆభరణాలు, రూ.54వేల నగదు, ఆటో, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు



నిందితుల నుంచి రికవరీ చేసిన సొత్తును చూపుతున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం: ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి ఆటో, రూ.80వేల విలువైన బంగారు ఆభరణాలు, రూ.54 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వివరాలను శనివారం డీఎస్పీ శివరాంరెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. తిప్పర్తి మండలం కేశరాజుపల్లి పరిధిలోని అంబేద్కర్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ కత్తుల యాదయ్య, అదే కాలనీకి చెందిన కత్తుల శివ ఉదయం వేళ ఆలయాల్లో రెక్కీ నిర్వహించి రాత్రి సమయాల్లో చోరీలకు పాల్పడుతుండేవారు. మునుగోడు పోలీస్ స్టేషన్ పరిధిలోని జమస్తాన్‌పల్లి రోడ్డులో స్థానిక పోలీసులతో పాటు సీసీఎస్ పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా నల్లగొండ నుంచి మునుగోడు వైపు వెళ్తున్న ఆటోను ఆపారు. అందులో వెళ్తున్న యాదయ్య, శివ అనుమానస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా.. దేవాలయాల్లో చోరీలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారు. కత్తుల యాదయ్య గతంలో పశువుల దొంగతనం కేసులో అరెస్టై జైలుకు వెళ్లినట్లు డీఎస్పీ తెలిపారు. ఇద్దరు కలిసి 14 ఆలయాల్లో చోరీలు చేసినట్లు పేర్కొన్నారు. వీరు తిప్పర్తి, కట్టంగూర్, నార్కట్‌పల్లి, నల్లగొండ రూరల్, కనగల్, మునుగోడు, చండూరు, హాలియా, వేములపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో 14 నేరాలకు పాల్పడినట్లు తెలిపారు. నిందితులు దొంగిలించిన సొత్తును రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించిన సీసీఎస్ సీఐ జితేందర్‌రెడ్డి, మునుగోడు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సీసీఎస్ ఎస్‌ఐ శివకుమార్, హెడ్‌కానిస్టేబుల్ విష్ణువర్ధన్‌గిరి, కానిస్టేబుల్ పుష్పగిరిని డీఎస్పీ అభినందించారు.

రైలు కిందపడి యువతి ఆత్మహత్య

వలిగొండ: ఒంటరిగా ఉంటున్న యువతి జీవితంపై విరక్తితో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన వలిగొండ–రామన్నపేట మధ్యన రైల్వే ట్రాక్‌పై శనివారం జరిగింది. రైల్వే పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం గొల్లెపల్లికి చెందిన మైత్రి పూజ (23) తండ్రి బతుకుదెరువు నిమిత్తం ముంబైకి వలస వెళ్లగా.. ఆమె తన తల్లితో కలిసి గొల్లెపల్లిలోనే అమ్మమ్మ ఇంటి వద్ద ఉండేవారు. గతంలోనే పూజ తండ్రి చనిపోగా.. కొద్దిరోజులకే తల్లి కూడా మృతిచెందింది. దీంతో పూజ అమ్మమ్మ వద్దే ఉండేది. రెండేళ్ల క్రితం పూజ అమ్మమ్మ కూడా మృతిచెందింది. ఆమె మేనమామ బతుకుదెరువు నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. అప్పటి నుంచి పూజ ఒంటరిగానే ఉంటుంది. ఒంటరి జీవితంతో విసుగు చెందిన పూజ గతంలో కూడా రెండుసార్లు ఆత్మహత్యకు పాల్పడగా గ్రామస్తులు రక్షించారు. శుక్రవారం రాత్రి ఆమె వలిగొండ–రామన్నపేట మధ్యన రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. శనివారం ఉదయం గ్యాంగ్‌మెన్ చూసి రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే హెడ్కానిస్టేబుల్ రజిత తెలిపారు.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్ట్

- మత్తు టాబ్లెట్లు, గంజాయి, 4 సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం

నల్లగొండ క్రైం: గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి గంజాయి, మత్తు టాబ్లెట్లు స్వాధీనం చేసుకున్నట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నల్లగొండ పట్టణంలోని నెహ్రూగంజ్‌కు చెందిన ఎస్‌డీ షోహెబ్, అక్కచెల్మ ప్రాంతానికి చెందిన ఎండీ ఇమ్రాన్‌పాషా, తిప్పర్తి మండలం అనిసెట్టిదుప్పలపల్లికి చెందిన గంటెకంపు దుర్గాప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన శీలం వెంకట త్రిపుర అభినయ్ శుక్రవారం మాచర్ల నుంచి నల్లగొండకు సాగర్ మీదుగా గంజాయి తీసుకొస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో కనగల్ మండలం తేలకంటిగూడెం వద్ద కనగల్ ఎస్‌ఐ విష్ణుమూర్తి, తన సిబ్బందితో కలిసి నలుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 150 గ్రాముల గంజాయి, రూ.2500 నగదు, మత్తు టాబ్లెట్లు, నాలుగు సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు..

మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా పోలీసులు గంజాయి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఎవరైనా గంజాయి తాగినా, విక్రయించినా 8712670266 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ముగిసిన శ్రీకాంత్‌రావు అంత్యక్రియలు



శ్రీకాంత్‌రావు (ఫైల్)

డిండి: లండన్‌లో అనారోగ్యంతో మృతిచెందిన డిండి మండలం తవక్లాపూర్ గ్రామానికి చెందిన వేముల శ్రీకాంత్‌రావు(29) అంత్యక్రియలు శనివారం స్వగ్రామంలో పూర్తయ్యాయి. బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న శ్రీకాంత్‌రావు ఆగస్టు 21వ తేదీన మృతిచెందగా.. శనివారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు అతడి మృతదేహం చేరుకుంది. అక్కడి నుంచి శ్రీకాంత్‌రావు మృతదేహాన్ని కుటుంబ సభ్యులు తవక్లాపూర్ గ్రామానికి తరలించి అంతిమ సంస్కారాలు పూర్తిచేశారు. ఉన్నతస్థాయికి ఎదగుతాడునుకున్న కుమారుడు విగతజీవిగా తిరిగి రావడంతో శ్రీకాంత్‌రావు తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు, రజిత దంపతులు గుండెలవిసేలా రోదించారు. శ్రీకాంత్‌రావు కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పరామర్శించారు.

స్థానిక సంస్థల్లో బీసీల ప్రాతినిధ్యం పెరగాలి

- బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు



కృష్ణమోహన్‌రావుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈవో భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు కోరుతున్న విధంగా ప్రజా ప్రాతినిధ్యం పెరగాలని బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో బీసీలకు దామాషా మేరకు రిజర్వేషన్‌లు అమలు కావాలన్నారు. దానికి సంబంధించిన కులగణన ప్రశ్నావళి రూపొందించి ప్రభుత్వానికి ఇచ్చామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌లకు నిర్దిష్ట ప్రణాళికలు కూడా అందజేశామని తెలిపారు. బలహీన వర్గాలు కులగణన నిర్వహించాలని చిరకాలంగా కోరుతున్నాయని, అది ఎలాంటి అడ్డంకులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలని కోరారు. రాష్ట్రంలోని బీసీలలోని సంచార విముక్తి జాతుల కులాలు ఇప్పటిక, ఆధునిక అభివృద్ధిని అందుకోలేక పోతున్నాయన్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ నిర్ణయించడానికి విశేషంగా కృషి చేశానని, అయితే తన పదవి గడువు ముగియడంతో తుది నివేదిక ఇవ్వకుండా నిష్క్రమించడం ఇబ్బంది కలిగిస్తున్న విషయమన్నారు. బీసీ హక్కుల కోసం పనిచేయడం తన జీవితంలో మధురఘట్టమన్నారు. తన పదవి చివరి రోజు కావడంతో తమ ఇష్టదైవం లక్ష్మీనరసింహస్వామిని కుటుంబసభ్యులతో దర్శించుకున్నట్లు చెప్పారు. అంతకుముందు ఆయనకు ఆలయ సంప్రదాయ రీతిలో అధికారులు స్వాగతం పలికారు. స్వయంభూవులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. లడ్డూ ప్రసాదాన్ని ఈఓ భాస్కర్‌రావు అందించారు.

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం



వెయిట్ లిఫ్ట్ చేస్తున్న క్రీడాకారిణి



పోటీలను ప్రారంభిస్తున్న రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు శృతి తదితరులు

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోచంపల్లి మండలంలోని జూలూరు గ్రామంలో శనివారం రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు ముకిరి శృతి ప్రారంభించారు. ఈ పోటీల్లో 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో యూత్ బాలికలు, బాలురు, సీనియర్ విభాగంలో పురుషులు, మహిళలు వెయిట్ లిఫ్టింగ్ పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడుతాయని అన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు అక్టోబర్‌లో హిమాచల్‌ప్రదేశ్‌లో జరుగనున్న జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారని చెప్పారు. ఆదివారం ముగింపు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుస్పాల వెంకటరమణ, యాదాద్రి జిల్లా అధ్యక్షుడు కాసుల భానుచందర్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కాసుల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వీరేశంను అడ్డుకున్న ఏఆర్ కానిస్టేబుల్‌కు చార్జ్ మెమో

సాక్షి, యాదాద్రి: నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను అడ్డుకున్న విషయంలో ఏఆర్ కానిస్టేబుల్ రామకృష్ణకు పోలీస్ అధికారులు శనివారం చార్జ్ మెమో జారీ చేశారు. శుక్రవారం భువనగిరిలో నిర్వహించిన సాగునీటి ప్రాజెక్టుల సమావేశానికి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెలికాప్టర్‌లో వచ్చారు. వారికి స్వాగతం పలకడానికి వెళ్తున్న ఎమ్మెల్యే వీరేశంను బాంబ్ స్క్వాడ్ టీం కానిస్టేబుల్ అడ్డుకోవడంతో ఆయన ఆగ్రహంతో అక్కడినుంచి వెళ్లిపోయారు. రాచకొండ సీపీ ఆదేశాల మేరకు డీసీపీ రాజేశ్‌చంద్ర విచారణ చేపట్టి కానిస్టేబుల్‌కు చార్జ్ మెమో జారీ చేశారు.

ప్రమాదం జరిగే వరకు పట్టించుకోరా!

- పెచ్చులూడి వర్షానికి కురుస్తున్న ఎస్సీ బాలుర హాస్టల్ భవనం
- విద్యార్థులను ఇళ్లకు పంపిన అధికారులు



పెచ్చులూడుతున్న మునుగోడు ఎస్సీ బాలుర హాస్టల్ పైకప్పు

మునుగోడు: చిన్నపాటి వర్షం కురిస్తే చాలు మునుగోడులో ఎస్సీ బాలుర హాస్టల్ భవనం స్లాబ్ పెచ్చులు ఊడి స్లాబులో నుంచి నీరు కురుస్తోంది. చిన్నపాటి వర్షం కురిసినా అందులో ఉంటున్న విద్యార్థులు తమ ప్రాణాలను అరచేతిలో కాలం వెల్లదీస్తున్నారు. ఈ విషయమై సాక్షి దినపత్రికలో ఒకమారు ప్రధాన సంచిక మొదటి పేజీలో, అంతకు ముందు జిల్లా పేజీలో కథనం ప్రచురితమైంది. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో పాటు కలెక్టర్ నారాయణరెడ్డి గతంలో ఆ హాస్టల్‌ను సందర్శించి వెంటనే ఆ హాస్టల్‌ను అద్దె భవనంలోకి మార్చాలని ఆదేశించారు. కానీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు అద్దె భవనంలోకి మార్చకుండా అందులోనే కొనసాగిస్తున్నారు. అయితే శుక్రవారం రాత్రి నుంచి కురిసిన వర్షానికి హాస్టల్ భవనం కురవడంతో పాటు స్లాబ్ పైకప్పు పెచ్చులు ఊడిపడ్డాయి. విషయం తెలిసిన రెవెన్యూ అధికారులు శనివారం ఆ హాస్టల్‌ను సందర్శించి వెంటనే విద్యార్థులను తమ ఇళ్లకు వెళ్లాలని సూచించారు. దీంతో ఆ హాస్టల్‌లో ఉండే 30మంది విద్యార్థులు వెళ్లిపోయారు. కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని హాస్టల్ భవనాన్ని మరొక చోటుకు మార్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

అధిక వర్షాలు.. పంటల రక్షణ



నీట మునిగిన పత్తి చేను

పెద్దవూర: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో కొన్ని పంటలకు మేలు కలిగిస్తున్నా, పల్లపు ప్రాంతంలో సాగులో ఉన్న పత్తి, మిరప, పప్పుదినుసుల పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఈ పంటలు నీటిలో మునగడంతో వాటికి చీడపీడల సమస్యలు ఎదురవుతున్నాయి. సకాలంలో వాటి నివారణకు చర్యలు తీసుకోకపోతే దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఇలాంటి పరిస్థితులలో రైతులు పాటించాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులను పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్ వివరించారు.

పత్తి పంట

- సాధ్యమైనంత వరకు పత్తి చేనులో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. ఎప్పటికప్పుడు కాల్వలను ఏర్పాటు చేసుకుని నీటిని తొలగించాలి.
- వర్షాలు తగ్గిన వెంటనే వీలైనంత త్వరగా భూమిలో తేమను తగ్గించుకునేందుకు అంతర సేద్యం చేయాలి.
- అంతర సేద్యం చాలారోజుల వరకు వీలు కాకపోతే, కలుపు సమస్య ఎక్కువగా ఉంటే విత్తిన 45–60 రోజుల పైరులో ఎకరాకు 400 మి.లీ. క్విజల్ ఫాస్ ఇథైల్+పైరిథయోబాక్ సోడియం 250 మి.లీ. కలిపి పిచికారీ చేసి కలుపును నివారించుకోవాలి.
- వర్షాలు తగ్గిన వెంటనే బురద పదునులో ఎకరాకు 30 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరట్ ఆఫ్ పొటాష్‌ను పైపాటుగా వేయాలి. లీటరు నీటికి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్, 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపి ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని పిచికారీ చేయాలి. విత్తిన సమయంలో భాస్వరం ఎరువును వేయని రైతులు ఎకరాకు 50 కిలోల డీఏపీ ఎరువు వేసుకోవచ్చు.



- ఆకుపచ్చ తెగుళ్ల తీవ్రత పెరగడానికి అవకాశం ఉన్నందున వర్షాలు తగ్గాక సాఫ్ లేదా కంపానియన్ అనే శిలీంద్రనాశిని మందు 2గ్రాముల చొప్పున, అలాగే ప్లాంటోమైసిన్ లేదా స్ట్రెప్టోసైక్లిన్ 0.2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పత్తిలో వర్షాలు తెరిపి ఇచ్చిన తర్వాత పిండి నల్లి ఉధృతి ఎక్కువయ్యే అవకాశం ఉంది. దీని నివారణకు గాను లీటరు నీటికి 1 మి.లీ. డైక్లోరోఫాస్‌తో పాటు 2మి.లీ. ప్రొఫినోఫాస్ మందును కలిపి పిచికారీ చేసుకోవాలి. వర్షాలు తగ్గిన మూడు, నాలుగు రోజులకు వరుసల మధ్య భాగాన్ని గుంటుకలతో దున్నాలి.
- అధిక వర్షాలకు వేరుకుళ్లు తెగులు ఆశిస్తే లీటరు నీటికి 3 గ్రాములు కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా ఒక గ్రామ్ కార్బండిజమ్ కలిపి మొక్క మొదళ్లలో తడపాలి.

పెసర పంట

- పెసర, మినుము పంటల్లో పేనుబంక, లద్దెపురుగు ఆశించే అవకాశం ఉంది. లీటరు నీటికి ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ కలిపి పిచికారీ చేయాలి.
- 20 నుంచి 25 రోజుల దశలో ఉన్న పంటలో కలుపు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. అంతర సేద్యం సాధ్యం కానప్పుడు పెసర, మినుము పంటలలో ఎకరాకు 200 మి.లీ. ఇమిజిథాపిర్‌ను 200 మి.లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఈ మందు వాడినప్పుడు పంట పెరుగుదల తాత్కాలికంగా వారం రోజులు ఆగుతుంది. తరువాత తేరుకుని మామూలుగా ఉంటుంది.
- వర్షాలకు ఆకుపచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంది. నివారణకు లీటర్ నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి పిచికారీ చేయాలి.

మొక్కజొన్న పంట

ముందుగా ఎకరానికి 50 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్‌ను పైపాటుగా వేయాలి. కాండం తొలిచే పురుగు, ఆకుఎండు తెగులు తీవ్రత ఎక్కువగా ఉండటానికి అవకాశం ఉంది. దీని నివారణకు గాను ఎకరానికి 400 మి.లీ ప్రొఫినోఫాస్, 200 మి.లీల ప్రొఫికొనజోల్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి చేను బాగా తడిసే విధంగా పిచికారీ చేయాలి. వర్షాలు తగ్గిన తర్వాత వరుసలలో గుంటుకతో దున్నాలి.

మిరప పంట

- మిరప నారుమళ్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.
- నారుకుళ్లు తెగులు నారుమళ్లను ఆశిస్తే లీటర్ నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2 గ్రాముల రిడోమిల్ కలిపి వారంలో రెండు, మూడు సార్లు నారుమళ్లను తడపాలి.

కంది పంట

పొలంలో నిల్వ ఉన్న నీటిని త్వరగా బయటకు పంపాలి. ఎకరాకు 15 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరట్ ఆఫ్ పొటాష్‌ను పైపాటుగా వేయాలి. ఇనుపధాతు లోపం వచ్చే అవకాశం ఉన్నందున లీటరు నీటికి అన్నభేది 5–10 గ్రాములు,+ 1 గ్రాము నిమ్మ ఉప్పు కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు, లేదా మూడు సార్లు పిచికారీ చేయాలి. అధిక తేమ వల్ల ఎండుతెగులు వచ్చే ప్రమాదం ఉంది. దీంతో మొక్కలు వాడుబడుతున్నట్లు కనిపిస్తే లీటరు నీటికి ఒక గ్రాము చొప్పున కార్బండిజమ్ కలిపి మొక్కల మొదళ్ల దగ్గర తడపాలి.